క్లుప్తంగా

అర్హులందరికీ పింఛన్ల మంజూరు



మునగపాకలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్యామల

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్‌లు అందజేస్తున్నామని ఉమ్మలాడ సచివాలయ కన్వీనర్ మందా రాము పేర్కొన్నారు. మంగళవారం మండల వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని వలంటీర్లు తెల్లవారు నుంచి ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.2750 వంతున పింఛన్ అందజేశారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు చెప్పండి



మునగపాక పీహెచ్‌సీని సందర్శిస్తున్న జిల్లా లెప్రసీ అధికారి బాలాజీ

మునగపాక : మునగపాక పీహెచ్‌సీని మంగళవారం అనకాపల్లి లెప్రసీ, టీబీ, హెచ్‌ఐవీ అధికారి డాక్టర్ బాలాజీ సందర్శించారు. ఆశ డే కార్యక్రమంలో భాగంగా ఆయన పీహెచ్‌సీని సందర్శించి జాతీయ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సీజన్‌లో ప్రజలకు ఎటువంటి అనారోగ్యం సంభవించకుండా తగు జాగ్రత్తలు చెప్పాలన్నారు. తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. ఆశాలు బాధ్యతగా సేవలందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి దుర్గా ప్రవలిక, ఆరోగ్య పర్యవేక్షకులు వీఎస్‌ఎం లక్ష్మి,ఎం.ఉమామహేష్, టీబీ సిబ్బంది వెంకటరమణ, పద్మజ పాల్గొన్నారు.

అర్చకులకు సన్మానం



అర్చకులను సన్మానిస్తున్న నూకన్నదొర

రాంబిల్లి : కొత్తపేటలో టీటీడీ ఆధ్వర్యంలో అర్చకులుగా శిక్షణ పూర్తి చేసి స్వగ్రామం వచ్చిన ఈశ్వరరావు, శివలను సమరసత ఫౌండేషన్ ప్రతినిధులు మంగళవారం సన్మానించారు. ఈ గ్రామంలో టీటీడీ ఆర్థిక సాయంతో దుర్గాదేవి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ ఆలయంలో అర్చన చేసేందుకు టీటీడీ శివ, ఈశ్వరరావులకు శిక్షణ ఇచ్చింది. కార్యక్రమంలో సమరసత ఫౌండేషన్ ప్రతినిధులు కె.అప్పారావు, పప్పల నూకన్నదొర పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

మునగపాక : ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మునగపాక పోలీసులు సీజ్ చేశారు. గణపర్తి శారదానది పరివాహక ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తున్నట్లు అందిన ఫిర్యాదుమేరకు మునగపాక పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

డి పట్టా భూముల రైతులకు న్యాయం చేయండి

కోటవురట్ల : సమగ్ర భూ రీ సర్వేలో డీ పట్టా భూముల రైతులకు అన్యాయం జరుగుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆరోపించారు. మంగళవారం సీపీఎం నాయకులు బి.కె.పల్లి గ్రామంలో డీ పట్టా భూములను పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. 2004–05లో సుమారు 90 మంది నిరుపేద దళితులకు 100 ఎకరాల డీ పట్టా భూములకు పట్టాలిచ్చారన్నారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వేలో డీ పట్టాలో ఉన్న విస్తీర్ణం కంటే తక్కువ భూమిని చూపిస్తున్నారని, దీనిపై విచారణ చేసి పూర్తి స్థాయిలో భూమిని కేటాయించాలని కోరారు.

అన్నదాతకు అంతా అనుకూలం

- కలిసి వచ్చిన వాతావరణం
- అడుగడుగునా ప్రభుత్వ భరోసా
- ఆర్‌బీకేలతో విత్తు నుంచి విక్రయం వరకూ ప్రోత్సాహం



నారు మడి



ట్రాక్టరుతో దమ్ము పడుతున్న రైతు

కోటవురట్ల : అన్నదాతల కళ్లల్లో ఓ మెరుపు..అనుకున్న స్థాయిలో లాభాలు వస్తాయన్న ఆశలు. అందుకు అనుకూలించిన పరిస్థితులు..అండగా నిలిచిన ప్రభుత్వం..అడుగడుగునా అందుతున్న ప్రోత్సాహం..పెట్టుబడికి ధోకా లేదన్న ధీమా..సకాలంలో అందిన విత్తనాలు..పచ్చగా ఏపుగా ఎదిగిన వరి నారు. దీంతో రైతన్న మోములో పట్టరాని సంతోషం కనిపిస్తుంది.. వాతావరణం అనుకూలించడంతో ఖరీఫ్ సాగుకు ఇదే అదనుగా భావించిన అన్నదాతలు హలం పట్టి జోరుగా పొలం పనులు చేపడుతున్నారు. ఉత్సాహంగా దమ్ము పట్టి మడులను సిద్ధం చేస్తున్నారు.

ఖరీఫ్‌కు ప్రోత్సాహం ఇలా..

రైతు భరోసా పథం ద్వారా ప్రభుత్వం 10,772 మంది రైతులకు రైతు భరోసా నిధులు రూ.5,80,96,500 జమ చేసింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ముందుగానే విత్తనాలు, ఎరువులను అందుకున్నారు. మండలంలోని 19 ఆర్బీకేల ద్వారా బీపీటీ 5204 రకం (25 కిలోలు) 154 బ్యాగులు, బీపీటీ 3291 రకం (30 కిలోలు) 13 బ్యాగులు, ఎంటీయూ 1061 రకం 77 బ్యాగులు, ఎంటీయూ 1064 రకం 464 బ్యాగులు, ఆర్‌జీఎల్ 2537 రకం 1802 బ్యాగులు అందజేశారు. అలాగే పచ్చిరొట్ట విత్తనాలు 296 బ్యాగులు పంపిణీ చేశారు.యూరియా, డీఏపీ, ఎంఓపీ 216 టన్నులు అందజేశారు.

నారు సిద్ధం...

వాతావరణం ముసురుకోవడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. చురుగ్గా వ్యవసాయ పనులు నిర్వహిస్తున్నారు. మండలంలో గత ఏడాది ఖరీఫ్ సీజనులో 1580 హెక్టార్లలో వరి సాగు జరిగింది. మంచి ఫలితాలు వచ్చి అధిక దిగుబడి సాధించారు. ఇపుడు కూడా అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది 1686 హెక్టార్లలో ఖరీఫ్ వరి సాగు లక్ష్యంగా వ్యవసాయాధికారులు చర్యలు చేపట్టారు. అయితే ఇపుడున్న పరిస్థితులతో అంతకు మంచి సాగు జరిగే పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం నారు సిద్ధంగా ఉండడంతో జోరుగా ట్రాక్టర్లతో దమ్ము పడుతున్నారు. కోటవురట్ల, రాజుపేట, యండపల్లి, అన్నవరం, జల్లూరు, పాములవాక, కె.వెంకటాపురం, కొడవటిపూడి, బి.కె.పల్లి, నీలిగుంట, లింగాపురం, రామచంద్రపురం, గొట్టివాడ, చౌడువాడ, కైలాసపట్నం గ్రామాలలో చురుగ్గా ఖరీఫ్ సాగు పనులు జరుగుతున్నాయి.

వాతావరణం బాగుంది..



ప్రస్తుతం వాతావరణం బాగుంది. ఖరీఫ్ సాగుకు అనుకూలిస్తోంది. వరి సాగు చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. నారు సిద్ధంగా ఉంది. నాట్లు వేసేందుకు దమ్ము పడుతున్నాం. ఇదే వాతావరణం మరికొన్ని రోజులు ఉంటే నాట్లు వేసేందుకు ఇబ్బంది ఉండదు.

–పైల శివరామ్, రైతు, చినబొడ్డేపల్లి

సకాలంలో విత్తనాలు అందాయి



ఆర్బీకేలా ద్వారా ముందుగానే విత్తనాలు, ఎరువులు అందాయి. ప్రభుత్వం మంచి ప్రోత్సాహాన్ని ఇస్తోంది. ఈ ఏడాది కూడా మంచి దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాం.

– కె.వరహాలబాబు, రైతు, నీలిగుంట

1,686 హెక్టార్లలో వరి సాగు లక్ష్యం



ఈ ఏడాది ఖరీఫ్‌లో 1,686 హెక్టార్లు వరి సాగు లక్ష్యంగా నిర్ణయించాం. రైతులకు అన్ని విధాలుగా అవగాహన కల్పించి ప్రోత్సాహం ఇస్తున్నాం. ప్రభుత్వం కూడా మంచి సహకారాన్ని అందిస్తోంది. ప్రస్తుతం పలు ప్రాంతాలలో దమ్ము పనులు జరుగుతున్నాయి.

– భీమిరెడ్డి సరోజిని, వ్యవసాయాధికారి

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



రాట్నాలపాలెంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు



దిమిలిలో ర్యాలీలో డాక్టర్ వెంకటేష్, వైద్య సిబ్బంది

కోటవురట్ల : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ కార్యకర్త ఎస్తేరురాణి తెలిపారు. రాట్నాలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి మెయిన్‌రోడ్డు వరకు ర్యాలీ చేసి నినాదాలు చేస్తూ తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. తల్లిపాల వారోత్సవాలను ఈ నెల 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఎస్తేరురాణి తెలిపారు. కార్యక్రమంలో గొల్లపేట ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం జీవన్, ఉపాధ్యాయురాలు కుమారి పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధకశక్తి

రాంబిల్లి : తల్లి పాల వారోత్సవాలు సందర్భంగా మంగళవారం దిమిలిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు తల్లి పాలు పట్టాలన్నారు. ఇలా 6 నెలల వరకు తల్లిపాలు బిడ్డ తాగడంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్.ఎస్.వి.ఎన్.రాజు, ఆరోగ్య పర్యవేక్షకుడు సీహెచ్ ధనరాజ్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మాట్లాడుతున్న హారిక

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని చీమలాపల్లిలో మంగళవారం తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. విజయవాహిని చారిటబుల్ ట్రస్టు కో–ఆర్డినేటర్ హారిక మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలకు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు.

అడుగేస్తే బురద...



బురదమయంగా మునగపాక ఇందిరమ్మ కాలనీ రోడ్డు

మునగపాక : మునగపాకలోని ఇందిరమ్మ కాలనీ రోడ్డు బురదమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ప్రధాన రహదారి అధ్వానంగా దర్శనమిస్తుంది. పంచాయతీ ద్వారా గతంలో గ్రావెల్ రహదారి నిర్మించారు. అయితే పక్కారోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో వర్షాలకు బురదమయమై ఈ మార్గం గుండా రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారి మెరుగునకు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

దీక్షలో గిరిజన చిన్నారులు



రిలే నిరాహార దీక్షలో కూర్చున్న గిరిజన చిన్నారులు

కోటవురట్ల : తమ గ్రామానికి రోడ్డు వేయాలని, పాఠశాల ఏర్పాటు చేయాలని అణుకు గ్రామానికి చెందిన గిరిజన చిన్నారులు నినదించారు. గిరిజనులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష మంగళవారం నాటికి 26వ రోజుకు చేరింది. ఈ దీక్షలో చిన్నారులు కూర్చుని రోడ్డు వేయాలని, పాఠశాల ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు.

ఆటో సంఘం అధ్యక్షునిగా లచ్చబాబు



లచ్చబాబు

రాంబిల్లి : దివ్వెల ఆటో సంఘం అధ్యక్షునిగా చవ్వాకుల లచ్చబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దిమిలి పరిసర గ్రామాలకు చెందిన దివ్వెల ఆటో సంఘం ఎన్నికలు దిమిలిలో మంగళవారం నిర్వహించారు. కార్యదర్శిగా ఎస్.అప్పలరాజు, ఇతర కార్యవర్గాన్ని ఆటో యూనియన్ సభ్యులు ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను పలువురు అభినందించారు.

సైబర్ వలలో పడొద్దు

పాయకరావుపేట : విద్యార్థులు సైబర్ నేరాలు బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దని సీఐ పి.అప్పలరాజు అన్నారు. సైబర్ నేరాలు–తెలుసుకోవలసిన జాగ్రత్తలపైన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ పి.అప్పలరాజు విద్యార్థులకు సైబర్ నేరాలపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంత జీవనం



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

ఎస్.రాయవరం : ప్రతి ఒక్కరులోనూ ఆధ్యాత్మిక భావం పెంపొందించుకుంటే ప్రశాంతమైన జీవనం గడపవచ్చని సమరసత ఫౌండేషన్ సభ్యుడు పోతు రంగారావు అన్నారు. వేమగిరి గ్రామంలో చిన రామాలయంలో టీటీడీ వారి సౌజన్యంతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వ్రతం ఆచరించారు. ప్రతి పౌర్ణమికి ఎంపిక చేసుకున్న గ్రామాల్లో ఇటువంటి వ్రతాలు పూజలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ వ్రతాల్లో పాల్గొనే దంపతులకు పూజా సామాగ్రి ఉచితం అందజేసినట్టు చెప్పారు.

పలు గ్రామాల్లో జోరుగా వరినాట్లు



చినగుమ్ములూరులో నారు తీస్తున్న దృశ్యం



నాట్లు వేసిన పొలం

ఎస్.రాయవరం : మండలంలో చినగుమ్ములూరు, పెట్టుగోళ్లపల్లి, దార్లపూడి తదితర ప్రాంతాల్లో రెండు రోజులుగా అన్నదాతలు నాట్లు ప్రారంభించారు. వర్షాలు ఆలస్యం కావడంతో కొన్ని గ్రామాల్లో మాత్రమే నాట్లు ప్రారంభమయ్యాయి. కొన్ని రోజులుగా వర్షాలు అడపా దడపా వర్షాలు కురుస్తుండడంతో వరహానదిలో నీరు చేరింది. దీంతో ముందుగా నారుమడులు సిద్ధం చేసుకున్న గ్రామాల్లో నాట్లు ప్రారంభం అయినట్టు రైతులు చెబుతున్నారు.

నేటి నుంచి టేక్ హోం రేషన్

ఇంటి వద్దకే వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరకులు



సిద్ధం చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం సరకులు

నక్కపల్లి : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు జగనన్న ప్రభుత్వం సరఫరా చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరకులు నేటి నుంచి నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే తీసుకెళ్లి అందజేయనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణులు, బాలింతలకు నెలలో 25 రోజులకు సరిపడా పోషకాహారాన్ని లబ్దిదారులకు ఇంటి వద్దకే అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. బియ్యం 3 కిలోలు, కందిపప్పు కిలో, పామాయిల్ 500 గ్రాములు, అటుకులు కిలో, చోడిపిండి కిలో, జొన్న పిండి కిలో, బెల్లం పావు కిలో, చిక్కి పావుకిలో, పాలు 5 లీటర్లు, కోడిగుడ్లు 25 చొప్పున ఒక కిట్‌గా సంచిలో ఉంచి వీటిని ఎండీయు(డోర్ డెలివరి) ఆపరేటర్ ద్వారా పంపిణీ చేయనున్నారు. పౌర సరఫరాల గోదాముల నుంచి ఈ సరకుల కిట్లను రేషన్ డిపోలకు చేర్చారు. వాటిని బుధవారం నుంచి గ్రామాల్లో గర్భిణులకు, బాలింతలకు అందజేస్తారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నక్కపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కోటవురట్ల, నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాల పరిధిలో 309 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 6వేలమంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు. వీరందరికీ బుధవారం నుంచి నేరుగా ఇళ్ల వద్దకే తీసుకెళ్లి సరకులు అందించనున్నారు.

దగ్గుపల్లి జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు



ఏఎన్‌ఎంలకు హాట్ బాక్సులు పంపిణీ చేస్తున్న నాయకులు

పాయకరావుపేట : వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీటీసీ లంక సూరిబాబు, పార్టీ సీనియర్ నాయకుడు పెదపాటి మేఘరంజన్, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు ముఖ్య అతిథులుగా హాజరై సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాయిబాబా జన్మదిన కేక్‌ను ఆయన తనయుడు దగ్గుపల్లి తేజ్‌తో కట్ చేయించి అభిమానులకు పంచారు. పీహెచ్‌సీ సిబ్బందికి హాట్ బాక్సులు పంపిణీ చేశారు. 108 సిబ్బందికి మంచాలు పంపిణీ చేశారు. ఆర్‌టీసీ కాంప్లెక్స్, అరటికాయల మార్కెట్ ఆవరణలో నివసిస్తున్న నిరుపేదలకు అన్నదానం చేశారు. పీహెచ్‌సీలో రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. సాయిబాబా కార్యాలయంలో తునికి చెందిన పుష్ప ప్రాథమిక కంటి ఆసుపత్రి వైద్యులతో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



విశాఖ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, యు.వి.రమణమూర్తిరాజు మంగళవారం కలిశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు వచ్చిన సీఎంకు వారు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే వార్డుల అభివృద్ధి

- పట్టణ వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు యర్రయ్యదొర
- రూ.20 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం



పెదపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు యర్రయ్యదొర, మున్సిపల్ కమిషనర్ వీరయ్య

యలమంచిలి : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే పట్టణాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని యలమంచిలి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర అన్నారు. యలమంచిలి మున్సిపాలిటీలో పెదపల్లి సచివాలయం పరిధిలో గొల్లలపాలెం, మంత్రిపాలెం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, ఇతర పనులకు మంగళవారం వార్డు కౌన్సిల్ సభ్యులు దాసరి చినమ్మలు, దుంగా అచ్చుతరావుతో కలసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పెదపల్లి గ్రామ సచివాలయం పరిధిలో గుర్తించిన సమస్యలపై ఎమ్మెల్యే రమణమూర్తిరాజు చొరవతో పెదపల్లి సచివాలయానికి రూ.20 లక్షల అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారని తెలిపారు. పెదపల్లి, మంత్రిపాలెం, గొల్లలపాలెం గ్రామాలకు వెళ్లే రహదారులకు నూతనంగా సీసీ రోడ్లు నిర్మాణం పూర్తి చేయడం ద్వారా ప్రజలు కష్టాలు తీరనున్నాయని అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో సరైన రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం ద్వారా పట్టణాలు గ్రామాల్లో రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి సంపూర్ణంగా నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. వార్డుల్లో ప్రధాన సమస్యగా ఉన్న రహదారులు, మురుగు నీటి కాలువల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ చూపి అధికారులు, గుత్తేదారులు త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందించాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వీరయ్య, టౌన్ ప్లానింగ్ అధికారిణి శ్రీలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి కుమార్, కొడిగుడ్డు రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాక పీఏసీఎస్‌కు ఉత్తమ సొసైటీ అవార్డు

4న ఆప్కాబ్ వజ్రోత్సవాల సందర్భంగా అవార్డు ప్రదానం



మునగపాక పీఏసీఎస్ కార్యాలయం

మునగపాక : రైతులకు మెరుగైన సేవలందించడంలో విశేష కృషి చేస్తున్న మునగపాక పీఏసీఎస్‌ని ఉత్తమ సొసైటీగా గుర్తించారు. 2022–23 సంవత్సరానికి సంఘం ద్వారా అందించిన సేవలకు గుర్తుగా ఉత్తమ సొసైటీగా ఎంపిక చేశారు. ఈ మేరకు సంఘ పర్సన్ ఇన్‌ఛార్జి కోనపల్లి రామ్మోహనరావుకు, సంఘానికి ఉత్తర్వులు అందాయి. సహకార బ్యాంక్ నుంచి రుణాలు, డిపాజిట్ల సేకరణ, చిరు వ్యాపారులకు తక్కువ వడ్డీకే రుణాలు అందజేస్తూ జిల్లాలోనే ఆదర్శ సొసైటీగా గుర్తింపు పొందింది. ఈ మేరకు ఈ నెల 4న విజయవాడలో జరగనున్న ఆప్కాబ్ సంస్థ ఏర్పాటు చేసి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా సొసైటీకి అవార్డు ప్రదానం చేయనున్నారు. రాష్ట్ర సహకార బ్యాంక్ నుంచి 4వ తేదీన విజయవాడకు రావాలని ఆహ్వానం అందినట్టు పర్సన్ ఇన్‌ఛార్జి కోనపల్లి రామ్మోహనరావు తెలిపారు. రాష్ట్రంలోనే ఉత్తమ సొసైటీగా గుర్తింపు పొందడంలో సహకరించిన ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి రైతు ఈ–పంట నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక : ప్రతి రైతు ఈ–పంట నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. వాడ్రాపల్లి సచివాలయంలో మంగళవారం ఈ–పంట నమోదుకు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ–పంట నమోదు చేసుకోవడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు సంబంధిత రైతులకు నష్టపరిహారం అందుతుందన్నారు. ప్రభుత్వం ద్వారా రైతులకు అందుతున్న సేవలపై మరింత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ తులసీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్బీకేలలో ఎరువుల పంపిణీ



కె.వెంకటాపురంలో ఎరువులు తీసుకెళుతున్న రైతు

కోటవురట్ల : కె.వెంకటాపురంలోని రైతు భరోసా కేంద్రం ద్వారా మంగళవారం ఎరువులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గొల్లు చిట్టిబాబు, రామ సత్యనారాయణ చేతుల మీదుగా రైతులకు ఎరువులను అందజేశారు. ఏవో సరోజిని మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు ఎక్కువగా డీఏపీ తీసుకెళుతున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా పూర్తి స్థాయిలో ఎరువులు అందజేస్తోందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఆర్బీకేలలో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

27 మందికి ఆస్తి హక్కు పత్రాల పంపిణీ



నునపర్తిలో ఆస్తి హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని నునపర్తిలో 27 మందికి ఆస్తి హక్కు ధ్రువీకరణ పత్రాలను సర్పంచ్ చుక్కా అనురాధ చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. జగనన్న భూ రక్ష, జగనన్న సంపూర్ణ భూ హక్కు పథకంలో భాగంగా సర్వే చేసిన మేరకు గ్రామ కంఠంలో ఉన్న వారికి ఈ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పల్లె వెంకటరావు, ఉప సర్పంచ్ యాండ్ర పైడిరాజు, డెయిరీ ప్రెసిడెంట్ నరసింగరావు, సచివాలయ కన్వీనర్ కూండ్రపు చినబాబు పాల్గొన్నారు.